కొత్త కలెక్టర్‌ను కలిసిన భద్రాద్రి జడ్పీ చైర్మన్

కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను సన్మానిస్తున్న జడ్పీ వైర్మన్ కంచర్ల

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జితేశ్ వి పాటిల్‌ను తన క్యాంపు కార్యాలయంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి.. శాలువా కప్పి సత్కరించారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి సత్వర పరిష్కారం చూపాలని, అలాగే జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంలో కలెక్టరేట్ కీలకపాత్ర ఉంటుందని, అందుకు ప్రజాప్రతినిధులుగా మా సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని పేర్కొన్నారు.

సరిహద్దుల్లో గస్తీ ముమ్మరం చేయాలి

సీపీ సునీల్ దత్

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ సునీల్ దత్

ఎర్రుపాలెం, జూన్ 20 : సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమ రవాణాను నియంత్రించేందుకు రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. గురువారం ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. ఠాణా పరిధిలో ఏ తరహా నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయో గుర్తించి వాటి నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. కేసుల నమోదు విషయంలో తాత్సారం చేయొద్దన్నారు. సిబ్బందికి విధి నిర్వహణలో రోల్ క్లారిటీ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యతా ప్రమాణాలు పాటించడం వల్ల బాధితులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం ఎందుకు కొనరు..?

- సొసైటీ అధికారులను నిలదీసిన రైతులు
- ప్రైవేట్ వ్యాపారులకు సహకరిస్తున్నారని ఆగ్రహం

అధికారులను నిలదీస్తున్న రైతులు

అశ్వారావుపేట, జూన్ 20: ''ధాన్యాన్ని ఎందుకు కొనడం లేదు..? మీరు కావాలనే తాత్సారం చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు పరోక్షంగా సహకరిస్తున్నారు'' అని, అశ్వారావుపేట సొసైటీ అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్వారావుపేట సొసైటీ అధికారులు తనతో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, కావాలనే తన ధాన్యం కొనడం లేదని రైతు చెన్నూరు రామకృష్ణ ఇటీవల ఇచ్చిన ఫిర్యాదుపై డీసీవో ఖుర్షీద్ స్పందించారు. ఆయన గురువారం డీసీఎస్‌వో, సివిల్ సప్లై డీఎం త్రినాథ్‌తో కలిసి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం నిల్వలను పరిశీలించారు. ధాన్యాన్ని మరోసారి తూర్పార పట్టాలని సొసైటీ అధికారులను ఆదేశించారు. ''ఏదైనా సమస్య ఏర్పడితే త్వరగా పరిష్కరించకుండా ఎందుకు ఆలస్యం చేశారు?'' అని, సొసైటీ అధికారులపై మండిపడ్డారు. అదే సమయంలో రైతులు అక్కడకు చేరుకుని, సొసైటీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం లేదని, ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేస్తూ.. ప్రైవేట్ వ్యాపారులకు సహకరిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కొనుగోలు కేంద్రంలో కనీస సదుపాయాలు కూడా లేవని డీసీవోకు ఫిర్యాదు చేశారు. ''ప్రశ్నిస్తే వేధిస్తారేమోనన్న భయంతో మేం మాట్లాడడం లేదు'' అని చెప్పారు. ఫిర్యాదులన్నింటిపై విచారణ జరుపుతామని రైతులకు డీసీవో హామీ ఇచ్చారు.

నేడు బొగ్గు బ్లాకులకు వేలం

- పాల్గొనాలా? వద్దా? అనే సందిగ్ధంలో యాజమాన్యం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 20 : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం 60 బొగ్గు బ్లాక్‌లకు వేలం వేయడానికి సర్వం సిద్ధమైంది. 2017లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మైన్స్ మినరల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్టు ప్రకారం బొగ్గు బ్లాకులన్నీ వేలం వేసేందుకు నిర్ణయించింది. సింగరేణి యాజమాన్యం కూడా పాటలో పాల్గొని బొగ్గు బ్లాక్‌లు పొందాలని ఆదేశించింది. అయితే శుక్రవారం జరిగే 60 బొగ్గు బ్లాకుల్లో సింగరేణికి సంబంధించిన శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాక్ ఉండగా.. వేలంలో పాల్గొనాలా? వద్దా? అనే సందిగ్ధంలో యాజమాన్యం ఉంది. 60 బొగ్గు బ్లాకులకు నిర్వహించే వేలంపాటలో ఒరిస్సా రాష్ట్రంలో 16, ఛత్తీస్‌గఢ్ 15, మధ్యప్రదేశ్ 15, జార్ఖండ్ 6, బిహార్ 3, పశ్చిమబెంగాల్ 3, తెలంగాణ 1, మహారాష్ట్ర 1 ఉన్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంపాటలో పాల్గొనవద్దని సింగరేణి యాజమాన్యానికి సూచించడంతో ఇంత వరకు వేలంలో పాల్గొన లేదు. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తే సింగరేణి యాజమాన్యం బొగ్గు వేలంలో పాల్గొనేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం సహకరిస్తే పాల్గొంటాం.. : డైరెక్టర్(పా) శ్రీనివాస్

హైదరాబాద్ వేదికగా శుక్రవారం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలంపాటలో ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు పాల్గొంటాం. ప్రభుత్వం ప్రోత్సహిస్తే సింగరేణి యాజమాన్యం వేలంపాటలో పాల్గొంటుందని, రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి ఆదాయం వచ్చే గనులను మాత్రమే వేలంలో దక్కించుకుంటాం. బొగ్గు నిల్వలు ఎంత ఉన్నది. ఎన్నేళ్ల వరకు వస్తుంది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, అటవీ శాఖ అనుమతులు వచ్చేలా ఉన్నట్లైతే అన్ని అవకాశాలు అనుకూలిస్తే టెండర్‌లో పాల్గొంటాం.

డైరెక్టర్ (పా) ఎన్‌వీకే శ్రీనివాస్

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : సింగరేణి డైరెక్టర్(పా) శ్రీనివాస్

కంపెనీ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా క్వార్టర్ల నిర్మాణం ఉండాలని, నాణ్యత లోపించినట్లైతే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సింగరేణి డైరెక్టర్(పా) ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్ హెచ్చరించారు. సింగరేణి అధికారులు, ఉద్యోగుల నివాసం కోసం కొత్తగూడెంలోని రైటర్ బస్తీ, బర్మాక్యాంప్‌లో నూతనంగా నిర్మిస్తున్న క్వార్టర్ల నిర్మాణాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమంలో భాగంగా ఉద్యోగులు, అధికారుల నివాసం కోసం రైటర్‌బస్తీ, బర్మాక్యాంప్‌లలో శిథిలావస్థలో ఉన్న పాత క్వార్టర్లను తొలగించిందన్నారు. మళ్లీ వాటి స్థానంలో అధునాతనంగా 195 క్వార్టర్లను నిర్మిస్తున్నామని, అందులో ఎంఏ టైప్ 57, ఎంసీ టైప్ 96, ఎండీ టైప్ 42 ఉన్నాయని తెలిపారు. పది కాలాల పాటు మన్నికగా ఉండే విధంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సందర్శనలో ఆయన వెంట జీఎం సివిల్స్ సూర్యనారాయణ, డీజీఎం రాజశేఖర్, కేపీసీ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు ఉన్నారు.

క్వార్టర్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డైరెక్టర్(పా) శ్రీనివాస్

త్వరలోనే డయాలసిస్ సేవలు

డీసీహెచ్ఎస్ రవిబాబు

సీహెచ్‌సీని సందర్శించిన డీసీహెచ్ఎస్ రవిబాబు

చర్ల, జూన్ 20 : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో త్వరలోనే డయాలసిస్ సేవలను అందుబాటులోకి తెస్తామని డీసీహెచ్ఎస్ రవిబాబు అన్నారు. గురువారం సీహెచ్‌సీని ఆయన సందర్శించారు. సెంటర్‌లో కలియతిరుగుతూ డయాలసిస్ సెంటర్‌కు అవసరమైన వసతులు ఇక్కడ ఉన్నాయని, త్వరలోనే అందుకనుగుణంగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మండల కేంద్రంలోని చుట్టుపక్కల ప్రాంత డయాలసిస్ బాధితులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే డయాలసిస్ చేయించుకునే విధంగా అతి త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. ఆయన వెంట ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

చేపల పెంపకంతో లాభాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న మత్స్య శాస్త్రవేత్త

కూసుమంచి, జూన్ 20 : మత్స్య రైతులు చేపల పెంపకంతో లాభాలు గడించవచ్చని, ప్రస్తుత మార్కెట్‌లో చేపలకు మంచి డిమాండ్ ఉన్నదని మత్స్య శాస్త్రవేత్తలు శ్యాంప్రసాద్, శాంతన్న, రవీందర్, పాలేరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమేశ్ అన్నారు. గురువారం పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రంలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, పశు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, ఉప కులాలకు చెందిన రైతులకు మూడు రోజులపాటు చేపల పెంపకంపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జనాభాకు తగ్గట్టుగా ఆహార ఉత్పత్తులు లభించే అవకాశాలు తక్కువగా ఉన్నాయన్నారు. అందుకోసం రైతులకు అనుకూలంగా ఉండే చేపల పెంపకాలన్ని ఏర్పాటు చేసుకోవాలని, దీని ద్వారా మంచి లాభాలు వస్తాయని తెలిపారు.

మత్స్య రైతులకు బ్యాంకులు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా.. అవగాహన కార్యక్రమంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన 25 మంది రైతులు పాల్గొన్నారు. వారికి చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు, దాణా, మార్కెటింగ్, రుణ సదుపాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

నిర్మాణాత్మక విమర్శ అవసరం

- మా ప్రభుత్వంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగదు
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహాసభల్లో డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం, జూన్ 20: తమ ప్రభుత్వంలో భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నిర్మాణాత్మకమైన విమర్శ అవసరమని అన్నారు. ఖమ్మంలో జరుగుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభల ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. మీడియా భద్రత కోసం చట్టాన్ని తేవాలనే మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచనతో తాను ఏకీభవిస్తున్నానని, ఆ చట్టాన్ని తెచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి ఈ సభలో ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహాసభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ప్రజాహితం కోసం పాటుపడాలి: తుమ్మల

జర్నలిస్టులు ప్రజాహితం కోసం పాటుపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. మహాసభల్లో ఆయన మాట్లాడుతూ.. సోషల్‌మీడియా పెను సవాలుగా మారినప్పటికీ విశ్వసనీయతలో పత్రికల స్థానం చెక్కు చెదరలేదని అన్నారు.

జర్నలిస్టులకు కనీస వేతనాలివ్వాలి: కూనంనేని

బృహత్తరమైన వ్యవస్థలో పనిచేస్తున్న జర్నలిస్టులకు కనీస వేతనాలు ఇవ్వాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మహాసభలో ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల కోసం సాగే పోరాటంలో తమ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని అన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కార్యవర్గం ఎన్నిక..

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభల ముగింపు సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా విరాహత్ అలీ, కే.రాంనారాయణ ఎన్నికయ్యారు. ముగ్గురు ఉపాధ్యక్షులను, మరో ముగ్గురు కార్యదర్శులను, 16 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

AMARA RAJA
Gotta be a better way

ఇనోబ్యాట్‌లో పెరిగిన అమర రాజా వాటా

హైదరాబాద్, జూన్ 20: నార్వేకు చెందిన ఇనోబ్యాట్ ఏఎస్‌లో వాటాను మరింత పెంచుకున్నది అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థ. కొత్తగా 4.5 శాతం వాటాను కొనుగోలు చేయడానికి 20 మిలియన్ల యూరోల (రూ.180 కోట్లకు పైమాటే) పెట్టుబడి పెట్టింది. దీంతో సంస్థలో అమర రాజా వాటా 9.32 శాతానికి చేరుకున్నది. గతంలో 10 మిలియన్ యూరోల పెట్టుబడి పెట్టిన విషయం తెలిసిందే.

డాలర్ ముందు రూపీ వెలవెల

ఒకానొక దశలో ఆల్‌టైమ్ లో.. 27 పైసలు క్షీణత

17 పైసలు పడిపోయి 83.61వద్దకు • 2 నెలలకుపైగా కనిష్ఠానికి పతనం

ముంబై, జూన్ 20: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 2 నెలలకుపైగా కనిష్ఠ స్థాయిని తాకింది. గురువారం ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం ఆరంభం నుంచే దేశీయ కరెన్సీ.. అమెరికా డాలర్ ముందు చతికిల పడుతూ వచ్చింది. ఈ క్రమంలోనే ఒకానొక దశలో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఏకంగా 27 పైసలు దిగజారి మునుపెన్నడూ లేనివిధంగా 83.68 స్థాయికి వెళ్లింది. అయితే మళ్లీ కోలుకోవడంతో 10 పైసలు బలపడింది. చివరకు బుధవారం ముగింపుతో చూస్తే 17 పైసలు క్షీణించి 83.61 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది ఏప్రిల్ 16న కూడా ఇదే స్థాయి వద్ద నిలిచిన విషయం తెలిసిందే.

క్రూడ్ సెగ

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం.. రూపీని ప్రభావితం చేసింది. మిడిల్ ఈస్ట్ దేశాల్లో రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు.. క్రూడ్ రేట్లను ఎగదోశాయి. ఈ క్రమంలోనే దేశీయ స్టాక్ మార్కెట్లు పెరిగినా ఆ జోష్‌ను రూపీ అందుకోలేకపోయింది. విదేశీ పెట్టుబడులు ఈక్విటీల్లోకి వచ్చినా రూపీపై ఒత్తిడి తగ్గలేదని ఫారెక్స్ ట్రేడర్లు సైతం విశ్లేషిస్తున్నారు. నిజానికి ఉదయం ఆరంభంలో 83.43 వద్ద మొదలైన రూపీ.. ఒకానొక దశలో 83.42కు బలపడింది. బుధవారం 83.44 వద్ద ముగిసిన సంగతి విదితమే.

ఇది కొనసాగితే..

రూపీ నష్టాలు ఇదే స్థాయిలో కొనసాగితే దేశీయ దిగుమతులపై ఆ ప్రభావం పెద్ద ఎత్తున ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని ఎగదోసి.. దేశ ఆర్థిక వ్యవస్థనే చిక్కుల్లో పడేయగలదు. వాస్తవానికి ఆర్బీఐ.. రూపీ ట్రేడింగ్‌లో జోక్యం చేసుకుంటూనే ఉంటుంది. అయినప్పటికీ దేశ, విదేశీ పరిణామాలు షేక్ చేస్తూనే ఉన్నాయి. అయితే దేశంలో పెరుగుతున్న ఫారెక్స్ రిజర్వులు కొంతలో కొంత ఊరటగా చెప్పుకోవచ్చని మెజారిటీ నిపుణులు మాట.



తెలుగు రాష్ట్రాల్లో జియో దూకుడు

హైదరాబాద్, జూన్ 20: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో తెలుగు రాష్ట్రాల్లో కంపెనీ నెట్‌వర్క్‌లోకి కొత్తగా 1.56 లక్షల మంది చేరారు. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 1,56,296 మంది నూతన సబ్‌స్క్రైబర్లు చేరడంతో మొత్తం సంఖ్య 3.29 కోట్లకు చేరుకున్నారు.

ఓలా ఐపీవోకి గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, జూన్ 20: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్..ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బహిరంగ మార్కెట్లో ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన 9.52 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుండటంతో రూ.5,500 కోట్ల నిధులను సేకరించాలని సంస్థ సంకల్పించింది. దీంతో పాటు ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ ఐపీవోకి కూడా అనుమతినిచ్చింది. ఈ రెండు సంస్థలు గతేడాది డిసెంబర్‌లోనే దరఖాస్తు చేసుకున్నాయి.

స్విస్ బ్యాంకుల్లో తగ్గిన డిపాజిట్లు

2023లో 70 శాతం దిగి రూ.9,771 కోట్లకు..

న్యూఢిల్లీ, జూన్ 20: స్విస్ బ్యాంకుల్లో భారతీయులు, దేశీయ సంస్థల డిపాజిట్లు మరింత తగ్గాయి. వరుసగా రెండో ఏడాది 2023లోనూ స్విస్ బ్యాంకుల్లో డిపాజిట్లు 70 శాతం తగ్గి నాలుగేండ్ల కనిష్ఠ స్థాయి రూ.9,771 కోట్ల(1.04 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్)కు పరిమితమయ్యాయని స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. 2021లో 14 ఏండ్ల గరిష్ఠ స్థాయి 3.83 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్‌కి చేరుకున్న డిపాజిట్లు ఆ తర్వాత వరుసగా రెండేండ్ల పాటు తగ్గుముఖం పట్టడం విశేషం. బాండ్లు, సెక్యూరిటీ, ఇతర ఆర్థిక మార్గాల ద్వారా వచ్చిన పెట్టుబడుల ఆధారంగా సెంట్రల్ బ్యాంక్ ఈ నివేదికను రూపొందించింది. అయినప్పటికీ స్విట్జర్లాండ్‌లో భారతీయులు కలిగివున్న నల్లధనం ఎంత అనేది ఇప్పటికీ తెలియరాలేదు. ఇండియన్స్, ఎన్ఆర్ఐలు లేదా ఇతరులు స్విస్ బ్యాంకుల్లో ఇతర దేశాలకు చెందిన సంస్థల పేర్లతో పెట్టిన డిపాజిట్లను ఈ గణాంకాల్లో చేర్చలేదు. 2006లో రికార్డు స్థాయిలో 6.5 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ డిపాజిట్లు ఉండగా, ఆ తర్వాతి తగ్గుముఖం పట్టాయని తన నివేదికలో వెల్లడించింది.

- 2020లో 39 శాతం పెరిగిన దేశీయ డిపాజిట్లు, 2021లో 8 శాతం అధికమవగా, 2022లో మాత్రం 18 శాతం తగ్గాయి.
- డిపాజిట్లలో బ్రిటన్ తొలిస్థానంలో నిలిచింది. 254 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్ డిపాజిట్లు కలిగివున్నది. ఆ తర్వాతి స్థానంలో అమెరికా(71 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్), ఫ్రాన్స్(64 బిలియన్ల స్విస్ ఫ్రాంక్స్) ఉన్నాయి.
- ఆ తర్వాతి స్థానాల్లో వెస్టిండీస్, జర్మనీ, హాంకాంగ్, సింగపూర్, లగ్జంబర్గ్ దేశాలున్నాయి.
- 2022లో 46వ స్థానంలో ఉన్న భారత్ ర్యాంక్.. ఈసారికిగాను 67వ స్థానానికి పడిపోయింది.
- మొత్తంగా 2022లో 1.15 ట్రిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌గా ఉన్న డిపాజిట్లు 2023లో 983 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌లకు తగ్గాయి.

తగ్గిన ఎఫ్‌డీఐలు.. పడిపోయిన ర్యాంక్

న్యూఢిల్లీ, జూన్ 20: విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడంలో భారత్ నిరాశపరుస్తున్నది. 2023లో దేశంలోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 43 శాతం తగ్గి 28 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంతో వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ర్యాంకింగ్‌లో భారత ర్యాంక్ 15వ స్థానానికి పడిపోయిందని ఐక్యరాజ్యసమితి కాన్ఫరెన్స్ ఆఫ్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్(యూఎన్‌సీటీఏడీ) తాజాగా విడుదలచేసిన నివేదికలో వెల్లడించింది. 2022లో భారత్‌లోకి వచ్చిన 48 బిలియన్ డాలర్లతో 8వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

నేడు తైవాన్‌కు పరిశ్రమల శాఖ అధికారులు

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాధ్యమైనన్ని ఎక్కువ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పడమే లక్ష్యంగా పరిశ్రమల శాఖకు చెందిన అధికారుల బృందం శుక్రవారం తైవాన్‌కు వెళ్లనున్నది. విదేశీ పెట్టుబడులు ఆకట్టుకోవడమే లక్ష్యంగా పరిశ్రమల శాఖకు చెందిన ఉన్నతాధికారులు అక్కడి ఎలక్ట్రానిక్స్ వస్తువుల తోపాటు చిప్‌ల తయారీ రంగానికి చెందిన సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై ప్రధానంగా వివరించనున్నారు.

ఇండ్లకు గిరాకీ నై

హైదరాబాద్‌లో ఈ త్రైమాసికం 20 శాతం తగ్గొచ్చని అంచనా



దేనికి సంకేతం?

ఇండ్ల అమ్మకాలపై ప్రాప్‌ఈక్విటీ పరిగణనలోకి తీసుకున్న నగరాల్లో ఒక్క హైదరాబాద్‌లోనే అత్యధికంగా డిమాండ్ పడిపోతున్నట్లు తేలడం గమనార్హం. నిజానికి ఎప్పుడూ హైదరాబాద్‌లో నివాసాలకు కొనుగోలుదారుల నుంచి పెద్ద ఎత్తునే ఆసక్తి కనిపించేది. కానీ ఈసారి అందుకు విరుద్ధంగా అంచనాలుండటం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ఇక రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇది మరింత హాట్ టాపిక్‌గా మారుతున్నది. నిజానికి గత పదేండ్లలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి పెద్దపీట వేసింది. దీనికి తగ్గట్టుగానే మౌలిక వసతులను కల్పిస్తూ అనుబంధ రంగాలనూ ప్రోత్సహించారు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్. అలాగే నాటి ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ తీసుకున్న చర్యలూ కలిసొచ్చాయి. బడా సంస్థల రాకతో ఇండ్లకు డిమాండ్ ఏర్పడింది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలైనా.. రియల్టీపై ఫోకస్ పెట్టకపోవడమే ఇండ్ల అమ్మకాలను దెబ్బతీస్తున్నదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

- *గత పదాది ఏప్రిల్-జూన్‌లో దేశంలోని 9 నగరాల్లో 1,21,856 యూనిట్ల ఇండ్ల అమ్మకాలు జరిగాయి. అయితే 2 శాతం తగ్గి ఈ పదాది ఏప్రిల్-జూన్‌లో 1,19,901 యూనిట్లకే పరిమితం కావచ్చంటున్న ప్రాప్‌ఈక్విటీ.*
- *ఈ జనవరి-మార్చి అమ్మకాలతో చూస్తే 18 శాతం పడిపోనున్నాయి. నాడు 1,46,194 ఇండ్ల విక్రయాలు జరిగాయి.*
- *హైదరాబాద్, పుణెల్లో హౌజింగ్ సేల్స్‌కు డిమాండ్ లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని ప్రాప్‌ఈక్విటీ విశ్లేషించింది.*
- *మొత్తం 9 నగరాల్లో పుణె, హైదరాబాద్‌ల్లో మాత్రమే గతంతో పోల్చితే ఇండ్ల అమ్మకాలు క్షీణిస్తాయని ప్రాప్‌ఈక్విటీ చెప్తున్నది. అయితే బెంగళూరు, ముంబై, చెన్నైల్లో యథాతథం.*
- *నవీ ముంబై, కోల్‌కతాల్లో ఆకర్షణీయ వృద్ధి నమోదయ్యేందుకు వీలున్నది. థానె, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలోనూ చెప్పుకోదగ్గరీతిలోనే నివాస విక్రయాలు పెరగవచ్చు.*

ఈ ఏప్రిల్-జూన్‌లో దేశంలోని ప్రధాన నగరాల్లో ఇండ్ల అమ్మకాల అంచనా

నగరం	2023	2024	వృద్ధి
థానె	22,956	25,041	9%
పుణె	26,586	22,482	-15%
బెంగళూరు	15,088	15,127	-
హైదరాబాద్	**18,757**	**15,016**	**-20%**
ముంబై	13,219	13,032	-
ఢిల్లీ-ఎన్‌సీఆర్	9,635	10,198	7%
నవీ ముంబై	6,640	9,035	36%
కోల్‌కతా	4,025	5,130	23%
చెన్నై	4,950	4,851	-

అన్‌సెక్యూర్డ్ లోన్లపై చర్యలుండాల్సిందే: ఆర్బీఐ

ముంబై, జూన్ 20: సంక్షోభాన్ని ముందే పసిగట్టి, దాన్ని అడ్డుకోవడానికి కృషి చేస్తున్నామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఈ క్రమంలోనే అన్‌సెక్యూర్డ్ రుణాలపై ఆర్బీఐ చర్యలు తీసుకోకపోతే అవి పెద్ద సమస్యల్నే సృష్టిస్తాయని హెచ్చరించారు. గురువారం ఇక్కడి ఆర్బీఐ కాలేజ్ ఆఫ్ సూపర్‌వైజర్స్‌లో ఆర్థిక స్థితిస్థాపకతపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో దాస్ మాట్లాడారు. గత ఏడాది నవంబర్‌లో తీసుకున్న చర్య.. అన్‌సెక్యూర్డ్ రుణాలతో రిస్క్‌ను అడ్డుకున్నదని గుర్తుచేశారు. ఆర్బీఐ తీసుకున్న చర్యలతోనే క్రెడిట్ కార్డు పోర్ట్‌ఫోలియోల్లో వృద్ధి 30 శాతం నుంచి 23 శాతానికి తగ్గిందన్నారు. అలాగే బ్యాంకింగ్, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రిస్క్‌తో కూడ